క్లుప్తంగా

పంటల పరిశీలన



మినుము పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నింద్ర: మండలంలోని రైతులు సాగు చేసిన వరి, మినుము పంటలను గురువారం జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు పంటలను పరిశీలించారు. వరిలో ఆకుముడుత, మినుములో కాండం కుళ్లు తదితర తెగుళ్లను వారు పరిశీలించారు. నింద్రలో వరి పంటలు సాగు చేసిన రైతులకు సస్యరక్షణపై సూచనలు ఇచ్చారు. వేపనూనెను ఎకరకాకు పిచికారీ చేయాలని ఆకుముడతకు క్లోరోపైరిఫాస్ మందును పిచికారీ చేయాలని సూచించారు. రైతులకు మందులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు లత, హేమవతి, హారతి, నగరి డివిజన్ ఏడీఏ సౌభాగ్యలక్ష్మి, మండల వ్యవసాయాధికారి తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడాదుస్తుల పంపిణీ



క్రీడాదుస్తులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

విజయపురం: మండలంలోని జంబాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తమిళనాడు, క్రిష్ణగిరికి చెందిన దాత డాక్టర్ వి.పవిత్రన్ 30 జతల క్రీడాదుస్తులను అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్రీనివాసులు తెలిపారు. గురువారం క్రీడాదుస్తులను పాఠశాలలోని క్రీడాకారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలన్నారు. ఇంతటి సహకారం అందడంలో ముఖ్యపాత్ర పోషించిన తిరుపతి బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ మేనేజర్ కె.మునిశేఖర్‌కు ప్రధానోపాధ్యాయుడితోపాటు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్తా చాటిన గొల్లపల్లి విద్యార్థిని



లోకేశ్వరిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పుత్తూరు: తిరుపతిలో ఈ నెల 24 నుంచి మూడు రోజులపాటు జరిగిన అంతర్ జిల్లాల అండర్-14 బేస్‌బాల్ పోటీలలో గొల్లపల్లి విద్యార్థిని సత్తా చాటింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు బంగారు పతకం సాధించడంలో గొల్లపల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని పి.లోకేశ్వరి ప్రధాన భూమిక పోషించిందని ఇన్‌చార్జి హెచ్ఎం రమేష్ తెలిపారు. గురువారం లోకేశ్వరిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో పీడీ గోపికృష్ణ, ఉపాధ్యాయులు ఎస్ఎస్ నాయుడు, నరసింహులు, చంద్రశేఖర్, శ్రీరాములు, ఏకాంబరరెడ్డి, హేమావతి, ప్రభావతి, గీత పాల్గొన్నారు.

పూలేకు ఘన నివాళి



పూలేకు నివాళులర్పిస్తున్న బహుజననేతలు

నగరి: మహాత్మ జ్యోతిరావు పూలే 133వ వర్ధంతిని సందర్భంగా బస్టాండు ప్రాంగణంలో బహుజన నాయకులు ఆయనకు ఘన నివాళులర్పించారు. అంబేడ్కర్ విగ్రహ ప్రాంతంలో జ్యోతీరావ్ పూలే చిత్రపటాన్ని ఏర్పాటుచేసి, పూజలు చేశారు. వెనుకబడిన తరగతి వారి ఉన్నతికి పూలే చేసిన కృషిని నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో పీసీపీ కార్యదర్శి ఆర్.బాబు, జై భీమ్ సేన వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పవర్ రామచంద్రన్, జేబీఎస్ రాష్ట్ర కార్యదర్శి సెల్వం, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగూర్, నాయకులు కృష్ణమూర్తి, సంపత్ కుమార్, కుమార్, ఉదయ్ కుమార్, అబ్బు బాషా, వేలు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ మల విసర్జనకు స్వస్తి పలకండి



మానవహారం ఏర్పాటు చేసిన విద్యార్థులు

పెనుమూరు(కార్వేటినగరం): బహిరంగ మల విసర్జన నేరమని, వాటి వల్ల వ్యాధులు వ్యాపిస్తాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఐఈసీ జిల్లా అధికారి శాంతి అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం పురస్కరించుకుని గురువారం పెనుమూరులో విద్యార్థులతో అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, బహిరంగ మల విసర్జనకు స్వస్తి పలికి, ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించుకుని వాటిని వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, టీచర్లు పాల్గొన్నారు.

రైతన్నకు సేవలు దూరం

కియోస్క్ మిషన్ ద్వారా రైతులకు ఎరువు, పురుగు మందులు అందించాలన్న లక్ష్యం నీరుగారిపోతోంది. ప్రతి సచివాలయ కేంద్రాల్లో గత ప్రభుత్వం కియోస్క్ సేవలను ఏర్పాటు చేసింది. చంద్రబాబునాయుడు అధికారం చేపట్టాక ఆర్బీకే సేవలను పట్టించుకోకపోవడంతో రైతులు ఎరువులు, పురుగు మందుల కోసం ప్రైవేటు డీలర్లపై ఆధారపడుతున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన ప్రతి సారి రైతులను పట్టించుకోవడం లేదనేది అంతా అంటున్న మాట. – విజయపురం

- రైతుసేవా కేంద్రంలో మూలనపడిన కియోస్క్
- నిలిచిన ఎరువులు, పురుగు మందుల విక్రయాలు
- సొసైటీలు, ప్రైవేట్ డీలర్ల వద్దకు రైతుల పరుగులు



సూరికాపురం పంచాయతీ భవనంలో మూలన పడి ఉన్న కియోస్క్ మిషన్

నగరి నియోజకవర్గంలోని 5 మండలాల్లో 78 సచివాలయాలతోపాటు రైతు భరోసా కేంద్రాల్లో అన్ని రకాల సేవలను పారదర్శకంగా అందించేందుకు కియోస్క్‌లను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా నమోదు చేసుకున్న రైతులకు ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్, యంత్ర పరికరాలు, తదితరాలను ఇంటి ముంగిటకే అందించేవారు. దీంతో రైతులకు మండల కేంద్రాలకు పరుగులు తీసే బాధ తప్పింది. ఇలా రైతులకు ఎన్నో విధాలుగా అండగా నిలిచిన రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసే దిశగా ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం అడుగులు వేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు వ్యవసాయం దండగ అంటూ రైతులను నిరాశ పరిచిన చంద్రబాబు నేడు ఆర్బీకే సేవలకు మంగళం పాడే పనిలో పడ్డారు. అంతే కాకుండా కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చడం తప్ప మిగిలిన సేవలకు స్వస్తి పలికింది. దీంతో రైతులకు సేవలందించే కియోస్క్ మూలన పడింది.

కియోస్క్ ప్రత్యేకతలు

గత ప్రభుత్వ హయాంలో రైతుభరోసా కేంద్రాల్లో డిజిటల్ కియోస్క్ ఏర్పాటు చేశారు. రైతులకు పారదర్శకంగా సేవలందించే లక్ష్యంతో ఆండ్రాయిడ్ సాంకేతిక పరిజ్ఞానంతో నడిచే ఈ మెషీన్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటి ద్వారా రైతులే నేరుగా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పరికరాలు, రైతులు పండించిన పంటలకు ఉన్న మార్కెట్ ధరలు, దగ్గరలో ఉన్న మార్కె టింగ్ వివరాలు తదితర సేవలను పొందే అవకాశం కల్పించారు. వాతావరణ సమాచారం, ఏ సమయంలో ఏ పంటలు వేయాలన్న సమగ్ర సమాచారాన్ని అందులో పొందుపరిచి రైతులకు అందించేవారు.

సేవలు పునరుద్ధరించాలి

గతంలో రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులకు ఇబ్బంది లేకుండా కియోస్క్ ఆధారంగా అధికారులు ఇంటింటికీ సరఫరా చేసేవారు. కూటమి ప్రభుత్వం వాటిని ఉపయోగించడం లేదు. దీంతో అన్ని సచివాలయాల్లో కియోస్క్ యంత్రాలు మూలన పడ్డాయి. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ముమ్మరంగా సాగుతున్నా కియోస్క్ ఉపయోగంలో లేకపోవడంతో రైతులు ఆ సౌకర్యాలను పొందలేకపోతున్నారు. యాజమాన్య పద్ధతులు, మార్కెట్ ధరలు వంటి సమాచారం తెలుసుకునే వీలు లేకుండాపోయింది. ఇప్పటికైనా టీడీపీ ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల్లో ఉన్న కియోస్క్ ఆధారంగా రైతులకు ఎరువులు, పురుగు మందులు, యాంత్రీకరణ అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

> **కియోస్క్ మిషన్ ఉపయోగిస్తున్నాం**
>
> అన్ని కేంద్రాల్లో కియోస్క్ మిషన్ ఉపయోగిస్తున్నాం. రైతులు మొబైల్ ద్వారా ఎరువు, పురుగు మందులు, యాంత్రీకరణ నమోదు చేసుకుంటున్నారు. ఎక్కడైనా కియోస్క్ మిషన్ మూలన పడి ఉంటే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. అలాగే వాటిని రైతులకు అందుబాటులో ఉండేలా చూస్తాను.
>
> – రజనికుమారి, ఏఓ, విజయపురం

రక్తదానం మిన్న



రక్తదానం చేసిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న ప్రిన్సిపల్

కార్వేటినగరం: అన్ని దానాల కంటే రక్తదానం మిన్న ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయలురెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్‌సీసీ సంయుక్తంగా స్విమ్స్ బ్లడ్ బ్యాంకు సహకారంతో మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. శిబిరంలో 21 మంది రక్తదానం చేశారు. వీరిలో కళాశాల మ్యాథ్స్ లెక్చరర్ ధనంజయరెడ్డి కూడా ఒకరు. ధనంయజయరెడ్డి ఇప్పటివరకు 25 సార్లు రక్తదానం చేసి విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని ప్రిన్సిపల్ అభినందించారు. రక్తదానం చేసిన విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. స్విమ్స్ బ్లడ్ బ్యాంకు అధికారి డాక్టర్ సురేష్, అధ్యాపకులు సీఎస్ లత, సుబ్బారావు, హరిబాబు, కార్తీక్, రఘు, బాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో ప్రదోష పూజలు

వెదురుకుప్పం: డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో గురువారం సాయంత్రం ప్రదోషకాల పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివునికి నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అంతకు ముందు వేకువజామునే కొండమల్లీశుని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో పాలు, పెరుగు, కుంకుమ, విభూదితో అభిషేకించారు. సాయంత్రం నందీశ్వరుడికి పాలు, పెరుగు, నారికేళ జలాలతో అభిషేకం చేశారు. నందీశ్వరుడిని పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. ప్రదోష పూజలనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. అయ్యప్ప భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన



కర్పూర హారతిలో పాల్గొన్న స్వాములు



కన్నుల పండువగా కర్పూర హారతి

- మార్మోగిన స్వామియే శరణమయ్యప్ప నామస్మరణ
- కన్నుల పండుగగా కర్పూర హారతి
- శబరిమల బయల్దేరిన స్వాములు

పుత్తూరు: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం లక్ష బిల్వార్చన వైభవంగా సాగింది. అయ్యప్పస్వామి పేరిట లక్ష నామాలతో లక్ష బిల్వార్చన ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిరాఘాటంగా భక్తి పారవశ్యంతో సాగింది. వేకువజామున వినాయకస్వామి హోమంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, స్వామివారిని చందనంతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం 9గంటలకు లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా ప్రారంభించారు. సాయంత్రం 6 గంటలకు కర్పూర హారతి కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. రాత్రి 8 గంటలకు అయ్యప్ప ఉత్సవమూర్తిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో అలంకరించి సుందరంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. స్వామివారిని మంగళవాయిద్యాల నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఇరుముళ్లు ధరించిన అప్పయ్య స్వాములు వివిధ వాహనాల ద్వారా శబరిమల యాత్రకు బయల్దేరి వెళ్లారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నగరి: పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ కృష్ణా రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు తప్పక హాజరు కావాలన్నారు.

రికార్డులు లేని వాహనాలకు జరిమానా

పాలసముద్రం: వాహనదారులు వాహనాల రికార్డులు సక్రమంగా లేకుంటే జరిమానా తప్పదని ఆర్టీఓ వాసుదేవరెడ్డి హెచ్చరించారు.. గురువారం పలు వాహనాల రికార్డులను ఆయన పరిశీలించారు. రికార్డులు లేని వాహనాలకు భారీగా జరిమానా విధించి వాహనాలను పోలీస్ స్టేషన్ తరలించారు. ఆయన మాట్లాడుతూ, వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, అలాగే ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు.

వ్యక్తిపై దాడి కేసు నమోదు

పాలసముద్రం: ఎస్టీలపై దాడి చేసి వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ రవి తెలిపారు. వనదుర్గాపురంలో ఎస్టీ కాలనీకి చెందిన వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన అగ్రకులస్తుడు దాడి చేసినట్లు సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితం కావడంతో కార్వేటినగరం సీఐ హనుమంతప్ప స్పందించారు. వనదర్గాపురం ఎస్టీ కాలనీలో విచారణ చేపట్టారు. సిమెంట్ రోడ్డుపై చెప్పులు వేసుకుని వెళ్లకూడదు, ట్యాంకుల్లో నీరు నుంచి నీరు పట్టుకోకూడదని చాలా రోజులుగా గొడవలు జరుగుతున్నట్టు గుర్తించారు. వెంటనే ఎస్టీలపై దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఆయన కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఏఎస్ఐ రవి కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, మహిళ పోలీస్ చరిత పాల్గొన్నారు.

ఆఖరి అస్త్రంగానే రసాయనాలు వాడాలి



మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ భాస్కరయ్య

పుత్తూరు: పంటల సాగులో రసాయన ఎరువులు, మందులు ఆఖరి అస్త్రంగానే వాడాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ భాస్కరయ్య సూచించారు. గురువారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో పుత్తూరు వ్యవసాయ డివిజన్ పరిధిలోని గ్రామస్థాయి విస్తరణా సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. భాస్కరయ్య మాట్లాడుతూ స్థానికంగా లభించే సేంద్రియ వనరులు, పశువుల ఎరువులతో భూములకు పోషణ అందించాలన్నారు. ప్రకృతి సాగు పద్ధతులు ఇందుకు చాలా ఉపయోగమన్నారు. ఈ పద్ధతులన్నీ పాటించినా ఫలితం లేకపోతేనే నిపుణుల సిఫారసు మేరకు రసాయన ఎరువులను వాడాలని వివరించారు. అలాగే అవసరానికి మించి పంట పొలాలకు రసాయనాలు వాడడంతో భూమి సాగుకు పనికిరాకుండా నిర్జీవమైపోతుందని హెచ్చరించారు. ఏఓ వేణుగోపాలరావు మాట్లాడుతూ రబీ కాలంలో వరిలో చేపట్టాల్సిన మేలైన వరి వంగడాలు, ఎరువుల వాడకం, చీడపీడల నివారణ గురించి వివరించారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, తిరుపతి శాస్త్రవేత్త డాక్టర్ దివ్య మాట్లాడుతూ వేరుశనగ సాగులో చేపట్టాల్సిన యాజమాన్యం పద్ధతులను వివరించారు. శ్రీకాళహస్తి టెక్నికల్ అధికారి సూర్యప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ సిబ్బందికి వృత్తి నైపుణ్యంపై వివరించారు. అనంతరం సిబ్బందికి పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పుత్తూరు ఏడీఏ రమేష్‌రాజు, ఏఓలు కోదండయ్య, విజయ్‌కుమార్, శోభారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి



సుబ్రమణ్యంను సన్మానిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

వెదురుకుప్పం: సమాజంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి ఒక్కరికీ అవసరమని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. గురువారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ కోర్సులో వెబ్ టెక్నాలజీస్ గెస్ట్‌లెక్చరర్ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ, పోటీ ప్రపంచంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల పొందాలంటే కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాల్సి వస్తోందన్నారు. ఎప్పటికప్పుడు వివిధ రంగాల్లో టెక్నాలజీ పరంగా వస్తున్న మార్పులను విద్యార్థులు ఆకళింపు చేసుకోవాలన్నారు. భవిష్యత్ తరాలకు వెబ్ టెక్నాలజీ సేవలే కీలకంగా కానున్నాయని చెప్పారు. కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు సుబ్రమణ్యంను ఘనంగా సన్మానించారు. కంప్యూటర్ కోర్సు విభాగాధిపతులు మున్వర్, శ్రీనివాసులు, ఐక్యూసీ కో-ఆర్డినేటర్ వెంకటేష్, ఫిజికల్ డైరెక్టర్ భరణీనాథ్ రెడ్డి, అధ్యాపకులు ఇస్మాయిల్, నరేంద్రబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు వెంకట్



విజయపురం: తిరుపతి యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన సౌత్‌జోన్ వాలీబాల్ పోటీల్లో ఇల్లత్తూరు గ్రామానికి చెందిన వెంకట్ సత్తా చాటాడు. ఇతను డిసెంబర్ 18వ తేదీ కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీల్లో పాల్గొంటాడు. ఎంపికపై గ్రామస్తులు, తలిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

బాలికల ఉజ్వల భవితకే 'కిశోరి వికాసం'



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పాలసముద్రం: యుక్త వయస్సులో ఉన్న బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ పేర్కొన్నారు. గురువారం బలిజకండ్రిగ జెడ్పీ హైస్కూల్లో సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపరవైజర్ సుశీల, మురళి కిశోరి వికాస కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం మాట్లాడారు. యుక్తవయస్సులో బాలబాలికలలో శారీరకంగా వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన ఆహారం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోల్‌మాల్ లేకుండా గోకులాలు నిర్మించండి

పాలసముద్రం: జాతీయ ఉపాధి హామీ పథకంలో పాడి రైతులకు మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణ పనులు పాదర్శకంగా చేపట్టాలని డ్వామా పీడీ రవి కుమార్ తెలిపారు. గురువారం ఆముల, బాలక్రిష్టాపురం పంచాయతీల్లో గోకులం షెడ్ల నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ నిబంధనల ప్రకారం నిర్మాణం చేసుకుంటే బిల్లులు వస్తాయని తెలిపారు. మండలంలో ఉపాహామీ కూలీల సంఖ్య పెంచాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ మార్గరెట్, జేఈ అనూషా, ఫీల్డ్ అసిస్టెంట్ మునస్వామి, ప్రభు పాల్గొన్నారు.

కూలిన ఫ్లెక్సీ.. తప్పిన ప్రమాదం



రోడ్డుపై పడివున్న ఫ్లెక్సీ

నగరి: బస్టాండు ప్రాంగణంలో టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ గురువారం సాయంత్రం వీచిన గాలికి రోడ్డుపై కూలింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఫ్లెక్సీలు నెలల తరబడి వర్షానికి, ఎండకు అలాగే ఉండడంతో పట్టుకోల్పోయి గాలికి పడిపోయిందని స్థానికులు తెలుపుతున్నారు. తమిళనాడు రాష్ట్రంలో ఫ్లెక్సీ పడి ఒక విద్యార్థి మృతి చెందిన సంఘటన సంచలనం రేపింది. అలాంటి విపత్తు జరగక మునుపే మున్సిపల్ అధికారులు ఫ్లెక్సీలను ఓమారు పరిశీలించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన పోటీలు

పుత్తూరు: ఎయిడ్స్ నిర్మూలన అందరి బాధ్యత అని, ఈ మహమ్మారిని సమూలంగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని రెడ్ రిబ్బన్ క్లబ్ డాక్టర్ షర్మిల కోరారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. చర్చా వేదిక, రంగోలి, పోస్టర్ ప్రదర్శన, వ్యాస రచన అంశాలపై పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ చంద్రమౌళి, అధ్యాపకులు సుజనా, వరలక్ష్మీ, గాయత్రి, సావిత్రి, పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

పిచ్చిగుంట్ల కుటుంబాలను ఆదుకుంటాం

- జీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి

గంగాధరనెల్లూరు: స్థానిక పంచాయతీలో పందుల పెంపకంపై జీవనం సాగిస్తున్న పిచ్చిగుంట్ల కుటుంబాలను ప్రభుత్వం ద్వారా అన్ని విధాలా ఆదుకుంటామని బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి హామీ ఇచ్చారు. గ్రామాల్లో చేస్తున్న సీడ్ సర్వేకు సంబధించి పంచాయతీలోని పిచ్చిగుంట్ల వారి నివాస ఉంటున్న ప్రాంతాన్ని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి సందర్శించారు. వీరి సమస్యలను బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి దృష్టికి ఎంపీడీఓ నివేదించడంతో ఆమె స్పందించి గురువారం ఈ ప్రదేశాన్ని సందర్శించారు. వారితో మాట్లాడుతూ, పైవిధంగా హామీ ఇవ్వడంతో పాటు ప్రభుత్వ రుణ సహాయం, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, అలాగే పక్కా గృహాలు మంజూరు చేయించి, విద్యుత్ సౌకర్యం కల్పిస్తామన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

- ఎస్టీయూ డిమాండ్
- ఆరు నెలలవుతున్నా చర్చలే లేవన్న నేతలు



డిమాండ్లు వెల్లడిస్తున్న ఎస్టీయూ నాయకులు

నగరి: 30 శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ ఉపాధ్యాయుల సంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఉపాధ్యాయుల సమస్యల సేకరణ-ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా యూనియన్ నేతలతో కలిసి ఆయన మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలలో ఉపాధ్యాయులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలు పూర్తయిన ఇంతవరకు ఉద్యోగ సంఘాలను చర్చలకు పిలవలేదని, కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ఆర్థికపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. 12వ పీఆర్సీకి సంబంధించి 30 శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలన్నారు. ఈ ప్రక్రియ ఆలస్యం కాకుండా కమిషనర్‌ను నియమించి వేగవంతం చేయాలన్నారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ రుణాలు మంజూరు చేయాలని ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేసి ఖాతాలలో వారికి రావాల్సిన మొత్తాలను జమ చేయాలన్నారు. రుణాలు మంజూరు చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. తల్లికి వందనం కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లల తల్లులకే వర్తింపజేయాలన్నారు. ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను ప్రకటించి వెరిఫికేషన్లు త్వరగా పూర్తిచేసి రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు డివిజన్ కన్వీనర్ గిరి, రాష్ట్ర కౌన్సిలర్లు సుబ్రహ్మణ్యం, నాగభూషణం, జిల్లా కౌన్సిలర్లు గణేషన్, మహేంద్రన్, మోహన్, నగరి మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



బూచివానత్తంలో వరి సాగును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

విజయపురం: రబీలో వరి సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని శాస్త్రవేత్త డాక్టర్ పి.లత అన్నారు. గురువారం మండలలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ నాగపద్మిని, నగరి ఏడీఏ సౌభాగ్యలక్ష్మితో పాటు ప్రాంతీయ పరిశోధనా శాస్త్రవేత్తల బృందం పర్యాటించింది. బూచివానత్తం పంచాయతీలో రైతులు సాగు చేసిన వరి, మినుము, జీలగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమలత మాట్లాడుతూ కొన్ని చోట్ల వరికి ఆకుముడత, కాండం కుళ్లు తేగులు సోకిందని, ఎకరాకు 1 లీటర్ వేపనూనె పిచికారి చేసి, వారం తరువాత అర లీటర్ క్లోరిపైరిఫాస్ పిచికారీ చేయాలన్నారు. అలాగే ఆకు ముడత, అగ్గితెగులు ఉంటే ఎకరా పంటకు 1లీటర్ వేపనూనె, అర లీటర్ క్లోరిపైరిఫాస్‌తో పాటు 200 గ్రామం కార్బండిజమ్ కలిపి పిచికారీ చేయాలని శాస్త్రవేత్త హారతి తెలిపారు.

వృత్తి విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

పెనుమూరు (కార్వేటినగరం): విద్యార్థులు వృత్తి విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వృత్తి విద్య టీచర్ మోహన్ అన్నారు. గురువారం పెనుమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్ ప్రాసెసింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత అవగాహన ర్యాలీ నిర్వహించారు. మోహన్ మాట్లాడుతూ, విద్యార్థులు ప్రతి ఒక్కరూ నైపుణ్య విద్యపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. అనంతరం ఆంధ్రా నైసీ రెస్టారెంట్‌కు మేనేజర్ మహిధర్ చైనీస్, ఇండియన్ వంటకాల తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.